క్లుప్తంగా

విద్యాసామగ్రి వితరణ



దాత అందజేసిన విద్యాసామగ్రిని చూపిస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: మండలంలోని గడిముడిదాం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రాజాం పట్టణానికి చెందిన కొల్లా పార్థసారధి సోమవారం రూ.10 వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. తన మనమడు రుగ్వేద్ పుట్టిన రోజును పురస్కరించుకుని విద్యార్థులకు తన వంతు సహాయం చేశానని దాత పార్థసారధి తెలిపారు. ఉపాధ్యాయులు పైడిరాజు, వాసు, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

గుడ్డ సంచుల పంపిణీ



గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

రాజాం: పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ సమితి రాజాం శాఖ సహకారంతో పట్టణ వాసులకు సోమవారం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. అంతకు ముందు రాజాంలోని సన్ స్కూల్ ఆవరణలో ఆ సంస్థ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు అచ్యుతరావు, బి.జానకీరావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, రెడ్డి శ్రీను, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, బాలమురళీకృష్ణ, పర్యావరణ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాజాం: రాజాం ప్రాంతీయ శిష్టకరణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం సభ్యులు రాజాంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పక్కి వాసుదేవరావు, ఉపాధ్యక్షులుగా కల్లేపల్లి శ్రీనివాసరావు, ఒప్పంగి నాగేంద్ర, ఉరిటి జగదీష్, ఉరిటి జగదీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కుప్పిలి సాయి రమేష్, కోశాధికారిగా బలివాడ నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా పక్కి అప్పలదాస్, బలివాడ వెంకటసూర్యనారాయణ, వాండ్రంగి నాగభూషణరావు, బలివాడ శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులుగా ఆగూరు రామారావు, వంతరాం కోటేశ్వరరావు, బాసూరి శంకరరావు, రఘుపాత్రుని ఈశ్వరచంద్రజయదేవ్, ఉరిటి వాసుదేవరావు, పక్కి నర్సింహమూర్తి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది.

ఉద్యోగ విరమణ సన్మానం



బాడంగి: ఎర్రయ్య దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్ సుధాకర్, సిబ్బంది

బాడంగి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా సేవలందించిన జి.ఎర్రయ్య సోమవారం ఉద్యోగ విరమణ చేశారు.ఎర్రయ్య దంపతులను తహసీల్దార్ కె.సుధాకర్, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ ధనం, ఎంఆర్ఐ జగదాంబ,వీఆర్‌ఓలు,వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం

రేగిడి: ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని, ప్రతీ ఉపాధ్యాయుడు ఈ వృత్తిని దైవంగా భావించాలని శ్రీకాకుళం జిల్లా విశ్రాంత విద్యాశాఖాధికారి ఆబోతుల ప్రభాకరరావు అన్నారు. మండలంలోని పనసలవలస ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నల్లపాటి రాజశేఖర్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన్ని ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావుతో కలిసి విశ్రాంత డీఈఓ ప్రభాకరరావు, సహోపాధ్యాయులు సత్కరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



శంబంగిని కలిసిన అచ్యుతవల్లి, భాస్కరరావు

బొబ్బిలి: పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మహిళావిభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తూముల అచ్యుతవల్లికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సూచించారు. పార్టీ మహిళావిభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన అచ్యుతవల్లి సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్థిక మండలి మాజీ రాష్ట్ర సభ్యులు తూముల భాస్కరరావు తదితరులున్నారు.

ఇదేం రాజ్యాంగం.. ?



మున్సిపల్ చైర్మన్‌ను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గోవిందరావు

- పనులన్నీ టీడీపీ కౌన్సిలర్లు ఉన్న వార్డులకేనా..?
- మున్సిపల్ చైర్మన్‌పై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ధ్వజం
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బొబ్బిలి: మున్సిపాలిటీలో 31 వార్డులున్నాయని, టీడీపీకి చెందినవి, ఇటీవల అవిశ్వాసం కోసం మీరు కొనుగోలు చేసిన వార్డుల కు తప్ప మిగతా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉన్న వార్డులకు పనులు కేటాయించరా, ఇది పద్ధతేనా అని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, ఎస్.రామకృష్ణ, చోడిగంజి రమేష్ నాయుడు, కోట పెదరాములు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు ను ప్రశ్నించారు.స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించారు. అజెండా ప్రకారం రూ.కోట్ల విలువైన ఏడీపీ, జనరల్ ఫండ్,అన్‌టైడ్ పనులను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఉన్న వార్డులకు మినహాయించి, మిగతా వార్డులకు కేటాయించడంపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. చైర్మన్ శరత్ స్పందిస్తూ మిగతా వార్డులకు తర్వాత నిధులు మంజూరు చేస్తామని సమాదానం దాటవేశారు.



సమస్యలు పరిష్కరించాలని కౌన్సిల్ హాలు ముందు ప్లకార్డులతో మౌన ప్రదర్శన చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

విజిటర్స్ చాంబర్ తొలగింపు మీ రాజ్యాంగం కోసమా..?

మున్సిపల్ కార్యాలయం పోర్టికో వద్ద ఉన్న కుర్చీలపై సందర్శకులు, కౌన్సిలర్లు, మీడియా కూర్చునే వారని, ఎన్నో సంవత్సరాలుగా ఉన్న ఈ కుర్చీలను కొత్తగా అవిశ్వాసంతో వచ్చిన చైర్మన్‌గా మీరు తొల గించడం సబబేనా, ఇటువంటి చిన్న విషయాలపై మీరు దృష్టి పెట్టడం దేనికి, మీ రెడ్‌బుక్ రాజ్యాంగం కోసమా? అని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు గోవిందరావు, తదితరులు ప్రశ్నించారు. దీనికి చైర్మన్ శరత్ బాబు బదులిస్తూ పోర్టికో వద్ద కుర్చీలు వేసుకుని కూర్చోవడం మీ సంప్రదాయమా అని ఎదురు ప్రశ్నించగా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం మీ చాంబర్ కోసం రూ.5లక్షలు ఖర్చుపెట్టి మంచి కుర్చీలు వేసుకునేందుకు మా కుర్చీలు లాగేస్తారా, ఇది సంప్రదాయమా అని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. గతంలో మున్సిపల్ కార్యాలయానికి క్యారేజీలు తెచ్చుకుని తింటూ కూర్చునే వారు, మహిళల కోసం కొట్టుకున్న సందర్భాలున్నాయి అవి సంప్రదాయమా..?, అధికారుల ఇళ్లలో నాలుగో తరగతి ఉద్యోగులు పనిచేస్తున్నారు అది సంప్రదాయమా..? ఓ చిరుద్యోగి చేస్తున్న అనధికార హంగామా సంప్రదాయమా..? అని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ప్రశ్నల వర్షం కురిపించడంతో చైర్మన్‌కి వారికి మధ్య చాలా సేపు వాదన జరిగింది. ఇది మీకు మంచిది కాదని చైర్మన్‌కు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు హితవు పలికారు. సందర్శకులు కుర్చీలు తీసేయడంపై దృష్టి సారించడం దేనికి, దాని వల్ల మీ వ్యవహారాలకు ఏమైనా అడ్డం వస్తోందా అని ప్రశ్నించారు. మున్సిపల్ సిబ్బంది తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద మద్యం తాగుతున్నారని, మద్యం మత్తులోనే ట్యాంకర్లు నడుపుతున్నారని, వాటిని సరిదిద్దాలని కోరారు.

తీర్మానం చేయడం కుదరదు

ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో ఉన్నారని, వారి సమస్యలను కౌన్సిల్‌లో చర్చించి న్యాయం జరిగేలా తీర్మానించాలని ఒకటో వార్డు కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు కౌన్సిల్‌లో లేవనెత్తారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ అలా తీర్మానం చేయడానికి కుదరదన్నారు. ఈ సమయంలో ఇంజనీరింగ్ కార్మికులు మా కడుపులు కొట్టొద్దు,అర్ధాకలితో మమ్మల్ని చంపకండి, మా సమస్యల్ని ప్రస్తావించండి,మా కష్టాన్ని గుర్తించండి అంటూ ప్లకార్డులు పట్టుకుని కౌన్సిల్ హాల్ ముందు మౌన ప్రదర్శన చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, డీఈఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

భూపట్టాల కోసం గిరిజనుల ధర్నా



ధర్నా చేస్తున్న గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, గిరిజనులు

మెంటాడ: దశాబ్దాలుగా అటవీ, బంజరు, ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న గిరిజనులు, దళితులకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రాకోటి రాములు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజన, దళిత రైతులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాకోటి రాములు మాట్లాడుతూ మండలంలో సుమారుగా 1,500మంది గిరిజన, దళిత కుటుంబాలుఎన్నో ఏళ్లుగా అటవీ, బంజరు భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు.భూపట్టాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వ్యవసాయ సంబంధ పథకాలు, రాయితీలు అందడం లేదన్నారు. పట్టాల కోసం గతంలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు అర్జీలు పెట్టుకోవడంతో భూసర్వే చేయించారని, అయితే సబ్ డివిజన్ చేయకపోవడంతో పట్టాల పంపిణీ కాలేదన్నారు. ఇంతలో ఆయన బదిలీపై వెళ్లిపోయారని, ప్రస్తుత తహసీల్దార్ అరుణకుమారి సమస్యను పరిష్కరించి అర్హులకు భూపట్టాలు పంపిణీ చేయాలని కోరారు. పట్టాల కోసం మల్లేడవలస, సారాడవలస, కొండపర్తి, పనసలవలస, పనుకువానివలస, జక్కువ, లోతుగెడ్డ, జీరికవలస, ఆంధ్ర, కొండలింగాలవలస పంచాయతీ మధుర గిరిజన గ్రామాలకు చెందిన గిరిజన, దళితులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

మెంటాడ నుంచి మల్లేడవలసకు, ఆంధ్ర నుంచి కుంబివలసకు రోడ్లు, కొండపర్తి వద్ద కల్వర్టు నిర్మించాలని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, ఎంపీడీఓ ఏ.భానుమూర్తికి ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రం అందజేశా రు. కొండపర్తి, మల్లేడవలస, మిర్తివలస గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రాము, దాట్ల హనుమంత రాజు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తామరపల్లి సోములు, జంగమయ్య, సిడగం జానకి, మల్లేడ రవి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే సహించేది లేదు



వీఆర్‌ఓలతో సమావేశమైన తహసీల్దార్ శ్రీను

బొబ్బిలిరూరల్: మ్యుటేషన్‌ల కోసం గ్రామాల్లో రైతుల నుంచి డబ్బులు వసూలు చేసే వీఆర్‌ఓలను ఉపేక్షించేది లేదని, అవినీతికి పాల్పడుతున్నట్టు ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.శ్రీను హెచ్చరించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసంబంధిత,ఇతర రెవెన్యూ పత్రాలకోసం పలువురు రెవెన్యూ సిబ్బంది లంచం అడుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. వీఆర్‌ఓలపై నిఘా ఉందని, లంచాలు,మామూళ్లు ఇలా ఏ విధంగానైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు తేలితే చర్యలకు వెనుకాడ బోమని చెప్పారు. జీఓ నెంబర్ 30 ప్రకారం ప్రభుత్వస్థలాలను ఆక్రమించుకున్నవారికి క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందని తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి ఎల్‌పీఎంలకు రూ. 550 ఫీజు వసూలు చేయాలని సూచించారు. ఆర్ఐ రామకుమార్,డీటీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

తెర్లాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పై గ్రామాల్లో ప్రజలు, రైతులకు వీఆర్‌ఓలు, అన్ని శాఖల అధికారులు అవగాహన కల్పించాలని తహ సీల్దార్ జి.హేమంత్‌కుమార్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.అనంతరం వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమ య్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీలను పరిశీలించి, సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. అలాగే ప్రజలు, రైతులు తమ సమస్యలపై అర్జీలు అందిం చేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వెళ్లాల్సిన పనిలేదని, మండలంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తెలియజేస్తే సరిపోతుందని అన్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు



మధుసూదనరావు దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

బొబ్బిలిరూరల్: విధి నిర్వహణలో అందించిన సేవలతోనే ఏఉద్యోగికైనా సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తాయని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అన్నారు. పక్కి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పక్కి మధుసూదనరావును స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి అతిథిగా హాజరై మధుసూదనరావు సేవలను కొనియా డారు. ఎంపీపీ శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ రవికుమార్, సహచర ఉద్యోగులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలంలో ఆక్రమణలను తొలగించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంకరరావు, తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని దావాల వీధి రోడ్డులో రస్తా సందును ఆక్రమించి కట్టిన గోడను వెంటనే తొలగించి అక్కడున్న పాత దారిని తిరిగి చూపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమించిన స్థలాన్ని ఆక్రమణదారులు లక్షల రూపాయలకు విక్రయిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. రస్తాను ఆక్రమించి గోడకట్టిన విషయం తెలిసినా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. ఈ స్థలం స్వాధీనం చేసుకోవాలని తాము ఇచ్చిన ఫిర్యాదుపై సర్వేకు వచ్చిన టీపీఎస్ ఇది మున్సిపల్ స్థలం కాదని, ఈ సారి ఎవరైనా ఫిర్యాదు చేస్తే బాగోదని హెచ్చరించడం విశేషమన్నారు.గతంలో ఈ స్థలం మున్సిపాలిటీదేనని కోర్టు తీర్పు కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. కోర్టు తీర్పు ఉన్నప్పటికీ టీపీఎస్ బెదిరించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే టీపీఎస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని గోడ పగలగొట్టి ప్రజలకు దారి చూపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. సీఐటీయూ నాయకులు ఎం ప్రసాద్, బి వెంకటి, కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి ఇక్కట్లు



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న కొండంపేట వాసులు

రాజాం సిటీ: రాజాం మున్సిపాల్టీలో తాగునీటి ఇక్కట్లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఓ పక్క మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె, మరో వైపు పైపులైన్ల లీకులు, విద్యుత్ కోతలు పట్టణవాసులను తాగునీటికి ఇబ్బంది పడేలా చేస్తున్నాయి. సోమవారం అన్ని వార్డులకు నీటి సరఫరా నిలిచిపోయింది . కొండంపేట, కొత్తవలస, పొనుగుటివలస, సారధి, వంజరాంపేట తదితర ప్రాంతాల్లో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతాల్లోని నేలబావులు, బోర్ల వద్దకు పరుగులు తీయాల్సి వచ్చింది. కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ఎవరికీ నీరు అందలేదు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి నీటికోసం గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెను విరమించకుంటే మరింత ఇబ్బందులు తప్పవని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజాంలోని ప్రధాన ట్యాంకులకు నీటిని సరఫరా చేసే రేగిడి హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతోనే ఈసమస్య వచ్చిందని మున్సిపల్ ఏఈ వెంకట్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించిన వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

రామభద్రపురం: తమ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల గ్రీన్ అంబాసిడర్లు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు.సీఐటీయూ జిల్లా నాయకుడు బలస శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు సుమారు 15 నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు.వారికి ఇచ్చే అరకొర వేతనం సైతం సంవత్సరాల తరబడి బకాయి ఉంటే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు.వేతనలు తక్షణమే విడుదల చేయకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.అనంతరం ఎంపీడీఓ రత్నం,డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణకు వినతిపత్రాలు అందజేశారు. గ్రీన్ అంబాసిడర్లు పోలిరాజు,గంగరాజు,రామకృష్ణ, శ్రీరామ్,రాము, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులతో నష్టం లేకుండా చూడండి



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: వంగర, రేగిడి మండలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపుతో రైతులకు పంట నష్టం, ప్రాణనష్టం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాజాం నియో జకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అధికారులను కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయ న విలేకరుల తో మాట్లాడుతూ వంగర, రేగిడి మండలాల్లో వారం రోజులుగా ఏనుగుల గుంపు హల్‌చల్ చేస్తోందని, పలుచోట్ల పంటనష్టం కల్గిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు ప్రాణహాని కూడా ఉందని తెలిపారు. ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా మండలాల రెవెన్యూ అధికారులతో మా ట్లాడామని చెప్పారు.అధికారులు ముందుగా రైతులను అప్రమత్తం చేయాలని, ఎలిఫెంట్ ట్రాకర్స్ వాటి గమనాన్ని పంటనష్టం లేని ప్రాంతాలకు చూ పించాలని కోరారు. పంటనష్టం జరిగినచోట రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

పేరెంట్స్‌కమిటీ కార్యదర్శిగా దామోదరరావు



ఆకుల దామోదరరావు

బొబ్బిలి: పాఠశాలల విద్యార్థుల పేరెంట్స్‌కమిటీ జిల్లా కార్యదర్శిగా ఆకుల దామోదరరావును రాష్ట్ర కమిటీ నియమించింది. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి పోరాడేతానని చెప్పారు.

బొబ్బిలి రోటరీ క్లబ్‌కు అవార్డులు



క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులకు అవార్డులు అందజేస్తున్న రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు

బొబ్బిలి: పట్టణంలోని రోటరీ క్లబ్ అందించిన సేవలను ప్రశంసిస్తూ జిల్లా గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వర రావు అవార్డులు ప్రకటించారని రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు తెలిపారు. ఈ మేరకు ఆయా అవార్డులను క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసన్, ప్రవీణ్‌కుమార్‌కు సోమవారం ఆయన అందజేశా రు. మొత్తం 10 విభాగాల్లో అవార్డులు వచ్చినట్టు తెలిపారు.

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ



మాట్లాడుతున్న బాపట్ల శిక్షణ కేంద్రం అధికారి నాగరాజు

బొబ్బిలిరూరల్: మహిళా సాధికారిత, సుపరిపాలనపై నియోజకవర్గంలోని మహిళా సర్పంచ్‌లకు స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం శిక్షణ ఇచ్చారు. బాపట్ల శిక్షణ కేంద్రం అధికారి నాగరాజు మాట్లాడుతూ మహిళా సాధికారితతోపాటు గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. గ్రామాల్లోని మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని, మహిళా సర్పంచ్‌లు సొంత నిర్ణయాలతో గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎంపీడీఓ పి. రవి కుమార్,డిప్యూటీ ఎంపీడీఓ అల్లు భాస్కర రావు పాల్గొన్నారు.

వరి నారుమడుల పరిశీలన



భీమవరంలో నారుమడులను పరిశీలిస్తున్న ఏఓ సూర్యప్రకాష్

బాడంగి: మండలంలోని భీమవరం గ్రామంలో వరి నారుమడులను ఏఓ జి.సూర్యప్రకాష్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడుల వరి నారు పోసేందుకు, వెదజల్లే పద్ధతిలో వరిసాగుకు ఇది సరైన అదును అని చెప్పారు.నారు మొలిచిన వారం తర్వాత డీఏపీ 1.5 కిలోలు,పొటాష్ 0.5 కిలో,యూరియా 1.5 కిలోలు రెండు దఫాలుగా నారుమడిలో చల్లాలని చెప్పారు. అలాగే వరి వెద జల్లే పద్ధతిలో సాగుచేసే వారు విత్తనాలు జల్లిన 48 గంటల లోపు కలుపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రిటిలాక్లోర్ లేదా పెండిమెథాలిన్ 30 శాతం ఈసీ కలుపు మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు.